ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 35 | సోమవారం 3-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..



## బీసీ కోటాపై రేపు అసెంబ్లీ

- కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైనా చర్చ
- శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశం
- దానికి ముందు రాష్ట్ర మంత్రివర్గ భేటీ
- వర్గీకరణపై సబ్ కమిటీకి నేడు కమిషన్ నివేదిక
- బీసీ రిజర్వేషన్లపై బూసాని కమిషన్ నివేదిక కూడా
- వీటిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ
- రాష్ట్రంలో తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు?
- 'స్థానికం'లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం.. చట్టసవరణకు కేంద్రానికి వినతి!
- 11 వరకు పార్లమెంటు సమావేశాలు
- కేంద్రం స్పందించకుంటే పాత రిజర్వేషన్ల మేరకే..
- పార్టీ పరంగా బీసీలకు 42% టికెట్లు ఇచ్చే చాన్స్!

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. మంగళవారం శాసనసభ, మండలి ప్రత్యేక భేటీ జరగనుంది. దానికి ముందు ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై అజెండాను ఖరారు చేయనుంది. సమగ్ర ఇంటింటి సర్వే పేరిట కులాల వారీగా ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై సర్వే నిర్వహించిన ప్రణాళికా విభాగం.. సంబంధిత నివేదికను ఆదివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించింది. అలాగే ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య న్యాయ కమిషన్ కూడా ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘానికి సోమవారం నివేదిక ఇవ్వనుంది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై విశ్రాంత అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే, స్థానిక ఎన్నికల్లో బీసీ కోటా, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై సమీక్షించనున్నారు. అనంతరం ఈ అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమవనున్న సమావేశం.. ఈ అంశాలపై చర్చ ముగిసే వరకూ కొనసాగనుంది. బీసీ కేటగిరీ ముస్లింలతో కలుపుకొని రాష్ట్రంలో బీసీ జనాభా 56.33 శాతం మేరకు ఉన్నట్లు సమగ్ర కులగణన సర్వే తేల్చింది. ఈ వివరాల ఆధారంగానే బూసాని వెంకటేశ్వరరావు కమిషన్.. స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. కులగణన సర్వే ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా 27.88 శాతం మేరకు ఉంది. అంటే వారికి స్థానిక సంస్థల్లో 27 నుంచి 28 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం బీసీలకు దక్కే రిజర్వేషన్ 22-23 శాతం మాత్రమే. బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలంటే పార్లమెంటులో చట్ట సవరణ చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో పేర్కొనాల్సిందే. ఈ మేరకు సమగ్ర వివరణతో కూడిన నివేదికను బూసాని కమిషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడానికి వీలుగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. అలాగే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**బడ్జెట్ సమావేశాల్లోపే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు?**

సర్పంచ్ ఎన్నికలకు ముందే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తయినా తమకు ఇంకా పదవులు దక్కకపోవడంపై క్షేత్రస్థాయి నేతల్లో కొంత అసహనం ఉంది. స్థానిక ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలంటూ వారు పార్టీ రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు.

## దేశానికి క్యాన్సర్ సవాల్

- 2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం
- ముందే గుర్తిస్తే చాలా కేసులు నయం చేయదగ్గవే
- కేంద్రం బడ్జెట్ నిర్ణయాలు ప్రశంసనీయం
- ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** భారతదేశానికి 2025లో క్యాన్సర్ ముఖ్యమైన ప్రజారోగ్య సవాల్‌గా మారనుందని.. దేశవ్యాప్తంగా 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మహమ్మారిని నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించి.. దాని కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం (ఫిబ్రవరి 4) 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా.. దాని నియంత్రణ, నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన పలుసూచనలు చేశారు. దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ మరణాల్లో మూడింట రెండువంతులు.. పొగాకు, మద్యం, ఇన్ఫెక్షన్ల కారణంగా సంభవించేవేనని, ఈ క్యాన్సర్లన్నీ నిరోధించదగ్గవి, తొలి దశలో గుర్తించి, సత్వర చికిత్సతో నయంచేయదగ్గవేనని ఆయన స్పష్టం చేశారు. "క్యాన్సర్‌పై పోరులో అందరూ కలిసిరావాలి" అంటూ విధాన నిర్ణేతలు, వైద్య నిపుణులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో.. బాధితులకు సత్వర వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు కీలక నిర్ణయాలను ప్రకటించడంపై ప్రశంసలజల్లు కురిపించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవడం, 36 ప్రాణాధార ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు, మూడు ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు. మూడేళ్లలో జిల్లాకో క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఏర్పాటు వంటి నిర్ణయాలను.. ఆ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, బాధితులకు అత్యున్నతస్థాయి వైద్యాన్ని అందుబాటులో ఉంచాల్సిన కీలక అవసరాన్ని కేంద్రం నొక్కిచెప్పిన తీరును కొనియాడారు. క్యాన్సర్‌ను జయించినవారి సంఖ్య (సర్వైవల్ రేటు) పెరగాలంటే.. దాన్ని సకాలంలో గుర్తించడమే ముఖ్యమని ఆయన తేల్చిచెప్పారు. "తొలి దశలోనే గుర్తించగలిగితే గనక.. చాలా క్యాన్సర్లకు ఇప్పుడు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే, ముందు మనం ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. అన్ని సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన వ్యక్తులకూ క్యాన్సర్ గుర్తింపు, చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. భారత వైద్య పరిశోధన మండలి తదితర సంస్థల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మన దేశంలో నిత్యం 200 మంది సర్విక్స్ క్యాన్సర్‌తో చనిపోతున్నారని.. అన్ని రకాల క్యాన్స ర్ బాధితులనూ పరిగణనలోకి తీసుకుంటే రోజుకు 1600 మంది దాకా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొవిడ్ మహమ్మారిపై మన దేశం చేసిన పోరాటం నుంచి నేర్చుకున్న విలువైన పాఠాలు క్యాన్సర్‌పై పోరులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

## 5 లక్షల మందితో కేసీఆర్ సభ!

**- త్వరలో గజ్వేల్‌లో నిర్వహణ - ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండా**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాలపై నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. గజ్వేల్‌లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నద్ధమ వుతోంది. 'నేను కొడితే మామూలుగా ఉండదు.. తొందర్లోనే భారీ బహిరంగసభ పెడదాం' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇటీవలే పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు. అందుకు అను గుణంగానే సభ నిర్వహణకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యమే అజెండాగా ఈ సభను నిర్వహించాలని కారు పార్టీ భావిస్తోంది. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనే సభను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కేసీఆర్ ఆదేశాలతో ఆ పార్టీ నేతలు బహిరంగ సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని గుర్తించే పనిలో పడ్డారు. త్వరలోనే 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## ఇది మధ్యతరగతి బడ్జెట్: మోదీ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** భారతదేశ చరిత్రలోనే మధ్యతరగతికి అత్యంత అనుకూల బడ్జెట్ ఇది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ప్రతి కుటుంబం హ్యాపీగా ఉందన్నారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడారు. రూ.12 లక్షల వరకు ఆర్జించే ప్రజలకు తాజా బడ్జెట్ గణనీయమైన ఉపశమనం కలిగించిందని, స్వాతంత్ర్య భారత చరిత్రలో ఇప్పటి వరకూ ఇంతటి ప్రయోజనం కలగలేదని చెప్పారు. ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ ప్రభుత్వం తప్పుడు హామీ లు ఇస్తోందని, అవినీతిలో కూరుకుపోయిందని, దాని ఫలితంగానే దేశరాజధానిలో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని మోదీ విమర్శించారు. అద్దాల మేడ ల్లో నివసించేవారికి పేదల పూరిగుడిసెలు, మధ్యతరగతి ప్రజల డబు ల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు పట్టవంటూ ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై విమర్శ లు గుప్పించారు. ప్రజలను లూటీ చేస్తున్నవారిని జవాబుదారీగా చేస్తామన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**వేల ఏళ్ల భారత్-ఇండోనేసియా బంధం**

భారత్, ఇండోనేసియా దేశాల మధ్య సంబంధాలు భౌగోళిక రాజకీయ అంశాలకు మాత్రమే పరిమితం కాదని, వేల సంవత్సరాలుగా ఒకే విధమైన సంస్కృతి, చరిత్రను కలిగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. రెండు దేశాలూ భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్నాయన్నారు. ఇండోనేసియా రాజధాని జకార్తాలోని మురుగన్ ఆలయ మహాకుంభాభిషేకానికి విచ్చేసిన భక్తులను ఉద్దేశించి ఆదివారం మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

## కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు: పొంగులేటి



వరంగల్: ఓరుగల్లును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలో భద్రకాళి ట్యాంక్ బండ్, టెక్స్ టైల్ పార్క్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి వెల్లడించారు. వరంగల్ రీజియన్‌కు తెలంగాణ ఆర్టీసీ కేటాయించిన 112 ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇవాళ(సోమవారం) 50 బస్సులను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రం హయగ్రీవాచారి గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి బస్సులను ప్రారంభించారు. మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముగ్గురు మంత్రులూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "పర్యావరణానికి హాని కలగకుండా తెలంగాణ ఆర్టీసీని అప్డేట్ చేస్తున్నాం. అందుకే ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్‌కు ఏ టెక్నాలజీ వచ్చినా వెంటనే దాన్ని వరంగల్‌కూ తెస్తాం. ఉమ్మడి ఏపీలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. 4.5 లక్షల గృహాలను ఇప్పుడు మొదటి విడతలో ఇస్తాం. రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం. అన్ని మండలాల్లో మోడల్ ఇందిరమ్మ గృహాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం. సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ చేస్తాం. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని పంపించాం. 80 లక్షల మంది ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్క్రూటినీ చేసి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తాం. దరఖాస్తు చేసుకోని వారు భయపడాల్సిన పనిలేదు. ఇందిరమ్మ గృహాలు అనేది నిరంతర ప్రక్రియ, అర్హులకు తప్పకుండా ఇస్తాం. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అందిస్తాం. రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎకరానికి రూ.12 వేలు చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, రేషన్ కార్డులు అందిస్తాం. భూమిలేని అర్హులైన పేదలకు ఏటా రూ.12వేలు ఇస్తాం. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఒకవేళ 200 ఎకరాలు సాగు చేస్తే ఆయనకూ రైతు భరోసా ఇస్తాం. 25 లక్షల మంది అన్నదాతలకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. సన్న వడ్లు పండించిన రైతన్నలకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం పదేళ్లలో మర్చిపోయిన రేషన్ కార్డులను మేము ఇవ్వబోతున్నాం. ప్రజలు ఇందిరమ్మ రాజ్యంలో ఏం కోరుకున్నారో అవన్నీ నెరవేరుతాయి. పేదోడి సొమ్ము విదేశాలకు పంపించిన అక్రమార్కుడిపై చట్టప్రకారం కేసులు పెడితే ప్రతిపక్షాలు రౌడీల్లా ప్రవర్తిస్తున్నాయి. ప్రతిపక్షాల చిల్లర మాటలకు మా అభివృద్ధి పనులే సమాధానం చెప్తాయని" అన్నారు.

## మావోయిస్టుల కోటలో 'ఆపరేషన్ ప్రస్థాన్'!

- యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ, ఉపాధి.. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల నిర్వహణ
- 6వేల మందితో యావత్మాల్‌లో క్రీడా పోటీలు
- మహారాష్ట్రలో తెలుగు ఐపీఎస్ చర్యలు

**ఎస్పీ చింత కుమార్‌కు ఫడణవీస్ ప్రశంసలు**

**వరంగల్, ఫిబ్రవరి 2:** మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేయడం అంటేనే ఐపీఎస్ అధికారులకు సవాలు లాంటిది. అలాంటిచోట విధి నిర్వహణ కత్తి మీద సాము లాంటిదే. కానీ, అక్కడ కూడా తన బాధ్యతలు చక్కగా నెరవేర్చడమేగాక.. యువత నక్సలిజం వైపు మొగ్గు చూపకుండా అనేక కార్యక్రమాలు చేపట్టారో తెలుగు ఐపీఎస్ అధికారి! ఆయనే మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ఎస్పీ చింత కుమార్! యువతలోని నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా పనిచేసిన ఆయన.. గ్రామాల్లో ఉపాధి లేకుండా ఎవరూ ఖాళీగా ఉండొద్దని భావించారు. నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించారు. గ్రామస్థాయి, డివిజన్, జిల్లా స్థాయిలోనూ క్రీడలు నిర్వహించారు. యావత్మాల్‌లో 6 వేల మందితో స్పోర్ట్స్ నిర్వహించి 'శభాష్ పోలీస్' అని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రశంసలందుకున్నారు.

**గ్రామీణ నేపథ్యంతోనే అవగాహన..**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామమానికి చెందిన చింత రాములు, శ్యామల దంపతుల కుమారుడు కుమార్. ఆయన భార్య దివ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా.. పిల్లలు ధృవయన్, విహాన్ ఉన్నారు. కుమార్ 2017లో ఐపీఎసగా ఎంపికయ్యారు. 2019 వరకు హైదరాబాద్‌లో శిక్షణ పొందిన అనంతరం మహారాష్ట్రలోని జల్గావ్ ఏఎస్పీగా విధుల్లో చేరారు. 2022లో గడ్చిరోలి జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. అక్కడ యువత నక్సలిజం వైపు ఆకర్షితులవకుండా అనేక కార్యక్రమాలు చేపట్టారు. గత ఏడాది ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దులో ఉన్న యావత్మాల్ జిల్లా ఎస్పీగా కుమార్‌ను బదిలీ చేశారు. అక్కడా నక్సల్స్ ప్రాబల్యం ఎక్కువే. 'ఆపరేషన్ ప్రస్థాన్' పేరుతో యువత కోసం కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలో ఖాళీగా ఉన్న, పేదరికంలో ఉన్న యువత జాబితాను సేకరించారు. వీరికి నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు. కోర్సులు పూర్తి చేసిన వారు స్వయం ఉపాధితో స్థిరపడుతున్నారు. బయట ప్రాంతాలకు వెళ్లలేని వారికి ఎస్పీ కుమార్ స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారు. యావత్మాల్ జిల్లాలో 31 పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో యువతకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వాటిలో గెలిచిన జట్లకు డివిజినల్, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు.

# నిరంకుశ విధానాలను మొగ్గలోనే తుంచేయాలి !


ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి కనీసం 8 గంటల పని కాలాన్ని సాధించి మేడే జరుపుకుంటున్న వేళ ఇటీవల అందుకు భిన్నంగా కొందరు కార్పోరేట్లు చేస్తున్న వ్యాఖ్యలు దీనిని అవహేళన చేసేలా ఉన్నాయి. అంతెందుకు ఉద్యోగులను పని యంత్రాలుగా భావిస్తున్నారు. నిరంతరం ఊడిగం చేసేలా..ఇల్లూ వాకిలి వదిలేసి పనికే పరిమితం కావాలన్న వీరి నిరంకుశ ఆలోచన విధానాలను ఆదిలోను తుంచేయాలి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగబోతున్న వేళ విపక్షాలు ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలి.పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతల లేకుండా, జీవితంలో ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియ కుండా చేస్తున్నారు. నిజానికి ఈ సమయంలో అయినా ఇక ఉద్యోగాలకు భద్రత కల్పించేలా, పనిగంటలు నిర్దేశించే లా కఠిన చర్యలకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. నిజానికి పనిచేసే ప్రదేశంలో మంచి వాతావరణం ఉంటే చెప్పకుండానే ఉద్యోగులు శ్రమిస్తుంటారు. ఇక అసలు విషయానికి వస్తే....వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గపు వర్గ స్వభావాన్ని బట్టబయలు చేసాయి. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యను ఎంతసేపు తదేకంగా చూస్తూ కూర్చుంటారు? ఆదివారం పూట కూడా పనిచేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నాను' అని అయన అన్నారు. కొన్నాళ్ల క్రితం ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. వారానికి 70గంటలు పనిచేయాలని నారాయణమూర్తి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు సుబ్రమణ్యన్ మరో 20 గంటలు అదనంగా కలిపి 90 గంటలు వారానికి పనిచేసి తీరాలంటున్నారు. అలా చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై కార్మికలోకం సహజంగానే ఆగ్రహిస్తోంది. ఇది పారిశ్రామిక విప్లవం తొలినాళ్లలో కనిపించిన బానిస మనస్తత్వానికి నిదర్శనం. దీనిని ఆదిలోనే అరికట్టాలి. కేంద్రం దీనిపై ఎలాంటి స్పందనా చూపలేదు.అందుకే విపక్షాలు పార్లమెంట్ సమావేశాల్లో దీనిని ప్రస్తావించి , ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారి మనస్తత్వాన్ని ఎండగట్టాలి. అవసరమైతే కార్మిక చట్టాలను బలోపేతం చేసేందుకు పూనుకోవాలి. పనిదినాలు, సెలవులు,కార్మిక చట్టాలు చట్టుబండలు అవుతున్న వేళ వీరు ఇలా రెచ్చిపోతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఉద్యోగులను యంత్రాలుగా చూస్తున్నారు. భారతీయ కార్మికుల రక్త, మాంసాలను దోచుకోవడానికి పోటీ పడుతున్నారన్న భావన కలుగుతోంది. ఇలాంటి వారిని నిగ్గదీయాలి. ఇదే సమయంలో కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఐటి ఉద్యోగులే కాకుండా చిన్నాచితక కంపెనీలు, రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న దినసరి కూలీలు ఇష్టపికే వెట్టి చాకిరీ చేస్తున్నారు. ఇలాంటి వారి గురించి ఆరా తీయాలి. కార్పొరేట్ ప్రపంచంలో కూడా సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. హర్ష్ వర్ధన్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర తదితరులు ఆ వ్యాఖ్యలలోని హేతుబద్ధతను తప్పు పట్టారు. కార్పొరేట్‌-మతశక్తుల కూటమిగా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లేబర్‌కోడ్‌లను రూపొందిం చింది. ప్రస్తుతమున్న గరిష్ట పనివేళలను మార్చడానికి ఆ కోడ్‌లలో ప్రతిపాదించింది. కార్మిక సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో లేబర్ కోడ్‌లను ఇంకా నోటిఫై చేయలేదు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కొన్ని బిజెపి ప్రభుత్వాలు కూడా పనిగంటలు పెంచేందుకు చట్టాలు తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఉత్పత్తిని పెంచడానికి, ఆర్థిక వృద్ధిని సాధించడానికి కార్మికులు ఎక్కువ గంటలు పని చేయాలని కొన్ని కార్పొరేట్ శక్తుల మాదిరిగానే ప్రభుత్వాలు కోరుకుంటుం డటం గమనార్హం. ఇది కార్మికుల రక్తమాంసాలతో కార్పొరేట్లకు లాభాలను వండి, వడ్డించే దుర్మార్గ చర్య! పనిగంటలు పెంచితే కార్మికులు గుండెపోటుతో మరణించే అవకాశం ఉందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక ఈ సందర్భంగా గర్తించాలి. నిజానికి మనిషి పనిచేయడానికి కొన్ని గంటలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తరవాత విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. కొంత ఉల్లాసం కూడా అవసరం. అలా చేయలేకపోతే మనిషి శరీరం పనిచేయదు. మెదడు ఆలోచించదు. మొద్దుబారి పోతుంది. నిజానికి దేశాభివృద్ధికి ఆటకం కలిగిస్తున్న అంశాలేమిటి? ప్రస్తుత సంవత్సరం జిడిపి 6.4 శాతానికి తగ్గుతుందని, నాలుగేళ్లలో ఈ స్థాయి పతనం ఎప్పుడూ లేదని జాతీయ గణాంకాల సంస్థ తెలిపింది. ప్రజల వద్ద కొనేందుకు డబ్బు లేకపోవడంతో దేశీయ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటున్న ఫలితమిది. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారి వాస్తవ ఆదాయంలోఎటువంటి పెరుగుదల లేదు. దానికి తోడు ద్రవ్యోల్బణం వెంటాడుతోంది. నిరుద్యోగం ఏటికేడాది పెరుగుతూనే ఉంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావాలు మార్కెట్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ వ్యయాన్ని తగ్గిస్తోంది. రైతుల పంటలకు కనీస మద్దతు ధర లభించడంలేదు. ఉపాధిహామీ నిధుల్లోనూ కేంద్రం కోత పెట్టింది. కార్మికులు శ్రమించి అధికోత్పత్తి చేసినా మార్కెట్లలో కొనే నాధుడు లేని పరిస్థితి నెలకొంది. ఈ అస్తవ్యస్థ విధానాలు మారాలి. సరైన విశ్రాంతి, వినోదంతోనే కార్మికలోకం అసాధ్యమైన విజయాలను సైతం సుసాధ్యం చేస్తుందన్న నిజాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఎనిమిది గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న కార్మికవర్గం మళ్లీ అలాంటి పోరాటాలు చేసైనా దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని తాజా ఘటనలు గుర్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. మనుషులను బానిసలుగా భావించే వర్గాలను గుర్తించి చీల్చి చెండాడాలి.

# ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్

**- మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి - భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం**



**ప్రయాగ్‌రాజ్ :** 144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ముఖ్యంగా బారత్ లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అమెరికా, యూకే వంటి దేశాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. దీంతో భారత్ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా మారుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దేశంలోని మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు యేటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల నుంచి దేశంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాకు తరలి వస్తున్న పర్యాటకుల్లో 21.4 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ప్రముఖ వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫాం అట్లీస్ నివేదికల ప్రకారం.. దాదాపు 48 శాతం ఆధ్యాత్మిక ప్రయాణ వీసా అప్లికేషన్లు మహా కుంభ్ వంటి పెద్ద ఈవెంట్‌లు, తీర్థయాత్రలకు లింక్ చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా.. ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. 42 మిలియన్ల మంది యాత్రికులు కుంభ్ మేళాకు వస్తారని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం దేశీయ, అంతర్జాతీయ సందర్శకులకు, భక్తులకు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో జా, జఐ వంటి దేశాల నుంచి కూడా ఆధ్యాత్మిక పర్యాటకుల సంఖ్య కూడా ఎన్నో రెట్లు పెరిగింది. వీరిలో మంది ప్రామాణికమైన, జీవితాన్ని మార్చే అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు. సహస్రాబ్ది ఆధ్యాత్మిక యాత్రికులలో 66? మంది మహిళలు ఈ మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయ పర్యాటక కార్యకలాపాల కంటే ఆధ్యాత్మిక, అర్థవంతమైన ఈవెంట్ల కోసం ఎక్కువ మంది యువత సెలవులను కేటాయిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో కనిపించిన ఈ కొత్త ట్రెండ్.. గ్రూప్ ట్రావెల్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. సమూహ ఆధ్యాత్మిక అనుభవాల కోసం ఇన్‌బౌండ్ ప్రయాణం కోసం ఏకంగా అప్లికేషన్లు 35 శాతం పెరిగాయట. గ్రూప్ టూరిజంలో భాగంగా పర్యాటకులు పవిత్ర ప్రదేశాలను సందర్శించినప్పుడు.. అక్కడి ఆచారాలలో పాల్గొనేందుకు అసక్తి చూసుతున్నారు. ముఖ్యంగా భారత్ ఆధ్యాత్మిక పర్యాటకం గత కొన్నేళ్లుగా బాగా పుంజుకుంది. వారణాసి, రిషికేశ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు ఈ జాబితాలో ముందున్నాయి. ఇక్కడకు ప్రతి యేట మిలియన్ల మంది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. గంగానది పక్కన ధ్యానం చేయడానికి, సాయంత్రం హారతి చూడటానికి అమితాసక్తి కనబరుస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధికి అధికారులు కూడా తీర్థయాత్రల చుట్టూ ఉన్న మౌలిక సదుపాయాలు, వసతిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆధ్యాత్మిక అన్వేషకులను స్వాగతించడానికి, మరిన్ని అనుభూతులను అందించడానికి భారత ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. మహా కుంభ్ వంటి అరుదైన కార్యక్రమాలకు రికార్డు స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడం, దాని ఆధ్యాత్మిక వారసత్వంపై పెరుగుతున్న ప్రపంచ ఆసక్తి వల్ల.. భారత్ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుంది.



# కెన్నడీ హత్యలో నిజాలు బయటకు వచ్చేనా?



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో జోరు పెంచారు. నిత్యం పదుల సంఖ్యలో కార్యనిర్వాహక ఉత్తర్వుల పై సంతకాలు చేస్తున్న ఆయన.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ , మాజీ సెనెటర్ రాబర్ట్ ఎఫ్. కెన్నడీ, పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన దస్త్రాలను బహిర్గతం చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు సంబంధించిన పూర్తి రికార్డులను ఎలా బహిర్గతం చేస్తారన్న దానిపై 15 రోజుల్లోపు ప్రణాళిక సమర్పించాలని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌ను ట్రంప్ ఈ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇక, రాబర్ట్ ఎఫ్. కెన్నడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యల దస్త్రాల విడుదలపై 45 రోజుల్లోగా ప్లాన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేసిన తర్వాత ఓవల్ ఆఫీసు నుంచి ట్రంప్ మీడియాతో మాట్లాడారు. 'ఇవి చాలా పెద్ద విషయాలు. ఇందులో నిజానిజాల కోసం కొన్ని దశాబ్దాలుగా చాలా మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు. హత్యల వెనుక ఏం జరిగిందో తెలుసుకునే హక్కు బాధిత కుటుంబాలు, అమెరికా ప్రజలకు ఉంది. అన్ని విషయాలు బయటకొస్తాయి. ప్రజా ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నా' అని అధ్యక్షుడు వెల్లడించారు. జాన్ ఎఫ్. కెన్నడీ హత్యపై ట్రంప్ గతంలోనూ పలుమార్లు మాట్లాడారు. ఆయన మరణించి 60 ఏళ్లు అవుతోందని, ఇప్పటికీ ఆ హత్య రహస్యంగానే ఉందని వ్యాఖ్యానించారు. తాను తిరిగి వైట్‌హౌస్‌కు వస్తే.. ఆ పత్రాలన్నింటినీ బహిర్గతం చేస్తానని ఎన్నికల ప్రచారం సమయంలో హామీ ఇచ్చారు. 1961లో అమెరికాకు 35వ అధ్యక్షుడిగా జాన్ ఎఫ్.కెన్నడీ బాధ్యతలు చేపట్టారు. 43 ఏళ్లకే ఆ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా అరుదైన ఘనత సాధించారు. 1963 నవంబరు 22న టెక్సాస్ పర్యటనకు వెళ్లగా ఆయనపై దాడి జరిగింది. కాన్వాయ్‌లో ప్రయాణిస్తుండగా.. దుండగుడు వెనుక నుంచి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య కేసులో తొలుత లీ హార్వే అనే వ్యక్తిని అరెస్టు చేయగా.. కేసు దర్యాప్తు జరుగుతున్న సమయంలో అతడు కూడా హత్యకు గురయ్యాడు. హార్వేను చంపిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్ష వేయగా.. కొంతకాలం తర్వాత అతడు క్యాన్సర్‌తో మరణించాడు. నాటి నుంచి కెన్నడీ హత్య ఘటన రహస్యంగానే ఉంది.అమెరికా అటార్నీ జనరల్, సెనెటర్‌గా పనిచేసిన రాబర్ట్ ఎఫ్. కెన్నడీ 1968లో హత్యకు గురయ్యారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు డెమోక్రటిక్ పార్టీ ప్రైమరీలు జరుగుతున్న సమయంలో ఇది చోటుచేసుకుంది. లాస్ ఏంజెలెస్‌లోని అంబాసిడర్ హోటల్‌లో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించి బయటకు వస్తుండగా.. రాబర్ట్‌పై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. నిందితుడిని పాలస్తీనాకు చెందిన సిర్హాన్‌గా గుర్తించారు. హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ కూడా 1968లోనే ఓ ర్యాలీలో మాట్లాడుతూ హత్యకు గురయ్యారు.

# జామ్‌నగర్‌లో అతిపెద్ద డేటా సెంటర్ ?

**రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ యోచన**



**ముంబై :** దావోస్ సదస్సులో పలు దిగ్గజ కంపెనీలో భారత్‌లో డేటా సెంటర్‌ల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద డేటా సంటర్లకు ఒప్పందాలు జరిగాయి. ఇదే సమయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను భారత్‌లో నిర్మించాలని చూస్తున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఇదో పెద్ద విప్లవాత్మక అడుగుగా భావించాలి. దీని కోసం ఎన్విడియా నుంచి అధునాతన ఏఐ చిప్‌లను కొనుగోలు చేయనుంది. ఈ డేటా సెంటర్ మూడు గిగావాట్స్ సామర్థ్యంతో ఏర్పాటు కావచ్చని అంచనాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్.. ఏఐ సేవల కోసం డేటా సెంటర్ సామర్థ్యాలను విస్తరించాలని చూస్తున్నాయి. దీని కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి. తాజాగా ఓపెన్ ఏఐ, సాఫ్ట్ బ్యాంక్, ఒరాకిల్ సంయుక్తంగా ఓ భారీ కృత్రిమ మేధ ప్రాజెక్టుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. స్టార్‌గేట్ ప్రాజెక్ట్ కోసం 500 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికలను కూడా ప్రకటించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అంబానీ చూస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీని నిర్మాణ పనులు అనుకొన్నట్లే ముందుకు సాగితే ప్రస్తుతం ఈ విభాగంలో భారత్ సామర్థ్యాలు పెరుగుతాయి. దేశంలో మొత్తం సామర్థ్యం గిగావాట్ కంటే తక్కువే ఉంది. కొత్త ప్రాజెక్ట్‌తో ఇది మూడింతలు పెరగవచ్చు. ఇది దేశానికి ప్రధాన మైలురాయిగా మారుతుంది. భారత్‌లో కృత్రిమ మేధ కంప్యూటింగ్ మౌలిక వసతులతో పాటు ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్విడియా గతేడాది అక్టోబర్‌లో చర్చలు జరిపాయి. ఇందుకోసం భారీ స్థాయిలో పెట్టుబడులు పెడతామని స్పష్టం చేశాయి. భారత్‌లో ప్రతిఒక్కరికీ ఏఐని అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని అంబానీ నాడు తెలిపారు. ఇప్పటికే రిలయన్స్ చమురు శుద్ధి, పెట్రోకెమికల్ కార్యకలాపాలకు వేదికగా ఉన్న జామ్‌నగర్ తాజాగా పునరుత్పాదక ఇంధనం, ఏఐ రంగంలో కీలక పాత్ర పోషించనుంది.

# స్టార్ హెూమియో కేర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



శంకరపట్నం, ఫిబ్రవరి,02

శంకరపట్నం మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పిన స్టార్ హెూమియో కేర్ క్లినిక్‌ను ఆదివారం మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెూమియోపతి, ఆయుర్వేద వైద్యపద్ధతులు ఇటీవలి కాలంలో మరింత ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. దుష్ప్రభావాల నివారణ కోసం ఆధునిక వైద్యంతో పాటు సంప్రదాయ చికిత్సా విధానాలను సమన్వయంతో ఉపయోగించుకుంటే ఉత్తమ ఫలితాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. అలాగే, వైద్యసేవలు అందుబాటులోకి రావడానికి ఇటువంటి ప్రైవేట్ క్లినిక్‌లు కూడా సహాయపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో హెూమియోపతి వైద్యం మీద విశ్వాసం పెరిగిపోతున్నదని, దీని ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం లభిస్తోందని వివరించారు. తక్కువ ఖర్చులో, దుష్ప్రభావాలు లేకుండా చికిత్స పొందే అవకాశాన్ని ప్రజలు ఉపయోగించు కోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి వైద్యసేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు క్లినిక్ నిర్వాహకుడు డాక్టర్ మహమ్మద్ ఉస్తాద్ అహ్మద్ మాట్లాడుతూ,హెూమియోపతి ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు సమర్థమైన పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణు లు కూడా హెూమియో చికిత్సను ఎటువంటి భయాందోళన లేకుండా తీసుకోవచ్చని చెప్పారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, డైరెక్టర్లు గాజుల వెంకటేశ్వర్లు, తణుకు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టు తిరుపతి, బండారు తిరుపతి, దుర్గం తిరుపతి, మొలంగూర్ సదానందం గౌడ్, ఊకంటి మధుకర్, జనగామ శ్రీనివాస్ గౌడ్, షారుఖ్, ఇషాముద్దీన్, అయన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

**- పేదలకు అనుకూలంగా సవరించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**




కరీంనగర్, ఫిబ్రవరి, 02

దేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ పూర్తి కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆరోపించారు. అన్ని వర్గాలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో సవరణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ, బడ్జెట్లో 25.2% నిధులు వడ్డీ చెల్లింపులకే కేటాయించడం చూస్తుంటే దేశం అప్పుల కుప్పగా మారిపోయిందన్న భావన కలుగుతుందన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులతో కలిపి 8 మంది ఎంపీలు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టడంలో వైఫల్యం చెందారన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకి అధిక కేటాయింపులు జరపడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమన్నారు. పేదలకు మొండి చేయి చూపి సంపన్నులకు మేలు చేసే బడ్జెట్ ప్రతిపాదించారని విమర్శించారు. ఉత్పాదక రంగాలకు తగిన నిధులు కేటాయించలేదని, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి బడ్జెట్లో కేవలం 2.5 శాతం నిధులను మాత్రమే కేటాయించారని, గత బడ్జెట్ కంటే ఈ రంగానికి పదివేల కోట్లు తగ్గించారని గుర్తు చేశారు. ఎరువుల సబ్సిడీ రూ.17 వేల కోట్లు కోత పెట్టారన్నారు. రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు కూడా నిధుల కేటాయింపు జరగలేదన్నారు. గ్రామీణ పేదలను మరింత బలహీనపరిచే విధంగా ఉపాధి హామీకి నిధులు తగ్గించారన్నారు. వైద్య రంగానికి బడ్జెట్లో 5 నుండి 10 శాతం నిధులు కేటాయించాల్సింది పోయి, కేవలం ఒకటి పాయింట్ 8 శాతం కేటాయించారని విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించారని అన్నారు. భీమా రంగంలో 100% ఎఫ్ డి ఐ పెట్టుబడును ఆహ్వానించడం ఆ రంగాన్ని మొత్తం కుదేలు చేసే చర్యలో భాగమే అన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ దేశంలో ఆర్థిక అసమానతలు పెంచే విధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్లో కేంద్రం జిల్లాకు మొండి చేయి చూపిందన్నారు. జిల్లా ప్రయోజనాలు కాపాడడంలో కేంద్రమంత్రి విఫలమైయ్యారన్నారు. కొత్తపల్లి, మనోహరాబాద్ కరీంనగర్, హసన్ పర్తి రైల్వే లైన్లకు నిధుల కేటాయింపులో స్పష్టత లేదన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి ప్రకటన ఊసే లేదన్నారు. ట్రిబుల్ ఐటీ, ఐఐఎం గురించి ప్రకటన లేదన్నారు. ఒక్క కేంద్రీయ విశ్వవిద్యాలయంను కేటాయించలేదన్నారు. నవోదయ సైనిక్ స్కూల్ పాఠశాలల ఊసే లేదన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం జిల్లా కమిటీ సభ్యులు డి నరేష్ పటేల్ పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకు కోసం భూమి కొనుగోలు..

**ఆరోపణలపై విచారణ జరిపిన సహకార అధికారి**



**జగిత్యాల, ఫిబ్రవరి, 02 :** జగిత్యాల జిల్లాలోని కథలాపూర్ మండలం గంబీర్ పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునిపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి సిహెచ్ మనోజ్ కుమార్ తెలిపారు.సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేయ తలపెట్టిన పెట్రోల్ బంక్ కు సంబంధించి భూమి కొనుగోలుపై సభ్యుల ఆందోళన నేపథ్యంలో జిల్లా సహకార అధికారి ఆదివారం గంబీర్ పూర్ సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్రోల్ బంక్ ఏర్పాటు నిమిత్తం భూమి కొనుగోలుకు సంబంధించిన అనుమతులను రద్దు చేశామని చెప్పారు. భూమి కొనుగోలు కోసం చెల్లించిన మొత్తాలను తిరిగి వసూలు చేస్తామన్నారు. సంఘం పరిధిలో ఎరువుల విక్రయాలను వెంటనే ప్రారభించాలని కార్యదర్శిని డీసీవో ఆదేశించారు. పాలకవర్గ వ్యవహారాలపై విచారణ చేస్తామని, రైతులు ఆందోళన విరమించాలని సూచించారు. డీసీవో సూచనల మేరకు రైతులు తమ ఆందోళన విరమించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఈ అంశం పై విచారణ జరపాలని జిల్లా సహకార అధికారికి సూచించారు. ఈ నేపథ్యంలో విచారణ కొనసాగింది.

# విరబూసిన 'కవన కుసుమాలు'

**కవితా సంపుటి ఆవిష్కరించిన డాక్టర్ గోవర్ధన రాజు**

హైదరాబాద్, ఫిబ్రవరి, 02

కుటుంబ వ్యవస్థ యొక్క విలువలు, మానవ సంబంధాల మాధుర్యాలను పునస్మరిస్తూ కవితా కుసుమాలతో కూర్చిన కవితా సంపుటిగా కవన కుసుమాలు నిలుస్తుందని ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం రోజున త్యాగరాయ గాన సభలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సభకు హాజరై డాక్టర్ సుమాల్య రచించిన కవన కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆరాధన, సామాజిక విలువలతో కూడిన కవితలతో రచించిన కవన కుసుమాలు అలతి పదాలతో, చక్కని భావుకతతో పాఠకులను ఆకట్టుకుంటాయని అన్నారు. పండిత వంశాన్ని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న అన్నమరాజు సుమాల్య చక్కని కవిత్వం అందించారని అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన పద్యభాషి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ సుమాల్య కవిత్వం సరళమై, సుబోధకమై అందరి హృదయాలను అలరిస్తుందని తెలిపారు. ప్రముఖ కవి చౌడూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చౌడూరి నరసింహారావు కవన కుసుమాలు పుస్తకాన్ని సమీక్షించగా కవి, రచయిత రాములు వేదికపైకి అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గంప ఉమాపతి ఆధ్వర్యంలో, చౌడూరి నరసింహారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. కవితలను ఆలపించిన కవులను సర్టిఫికెట్, శాలువా మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కవులు, సాహిత్య అభిమానులు పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# సేవాదళ్ అధ్యక్షుడిగా గోవిందు రమేష్

**సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం**



కోహెడ, ఫిబ్రవరి,02

హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులుగా నియమితుడైన మండల కేంద్రానికి చెందిన గోవింద్ రమేష్ ను ఆదివారం అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా సన్మానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ వాది మంద మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పద్మశాలి బిడ్డకు సేవాదళ్ నియోజవర్గ బాధ్యతలు అప్పగించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, సామాజిక కార్యకర్త డాక్టర్ జయశంకర్, ముంజ ప్రకాష్,ఇల్లందుల శ్రీనివాస్, ముంజ రమేష్, వేముల రవీందర్, అరుణ, కనకవ్వ, వేముల లక్ష్మి, చాంద్ పాషా, లడ్డు,వేముల శ్రీనివాస్,మహ్మద్ జాకీర్ హుస్సేన్, వాసాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల తాత్కాలిక శిక్షకుల సంఘ ఎన్నికలు

**అధ్యక్షునిగా మద్దెల లక్ష్మణ్**



కరీంనగర్, ఫిబ్రవరి, 02

కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్ విభాగం పరిధిలోని ఆర్ట్, వర్క్ ఎడ్యుకేషన్, పీఈటీ, సంగీత, నృత్య ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మానకొండూరుకు చెందిన ఆర్ట్ టీచర్ మద్దెల లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీటీఐల సంఘం రాష్ట్ర నాయకుడు దండు అశోక్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా పిటిఐలకు 12 నెలల జీతం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మహిళా పీటీఐలకు180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరయ్యాయన్నారు. మొట్ట మొదటిసారిగా రాష్ట్రంలో పిటిఐ ఐక్యవేదికను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, హక్కుల సాధనకై మునుముందు నిర్వహించే పోరాటాలకు వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 16 మండలాలకు మండల శాఖల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట జేఏసీ అధ్యక్షులు మహేంద్ర చారి, సిరిసిల్ల జేఏసీ అధ్యక్షురాలు నీరజ, పెద్దపల్లి జేఏసీ అధ్యక్షుడు పిల్లి రమేష్, జగిత్యాల జేఏసీ అధ్యక్షుడు సురేష్ తదితరులు హాజరయ్యారు.

# లక్ష డప్పులు, వేయి గొంతులు గోడప్రతి ఆవిష్కరణ



ఎండపల్లి, ఫిబ్రవరి, 02

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఈనెల 7న హైదరాబాద్ లో తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమ పోస్టర్ ఆదివారం రాజారాంపల్లిలో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మోకెనపల్లి సతీష్, ఉమ్మడి వెల్గటూరు మండల అధ్యక్షుడు, కొండాపూరు మాజీ ఉప సర్పంచ్ చెన్న కుమార స్వామి ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై, ఈ ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, రాజకీయ, సామాజిక, ఆర్థిక ఫలాలను అత్యల్ప జనాభా గల ఒక సామాజిక వర్గం వారే యధేచ్ఛగా అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు.రిజర్వేషన్ల అంశం కేవలం మాల, మాదిగలకు సంబంధించింది కాదని, ఎస్సీలలోని 59 ఉప కులాలకు సంబంధించిందని స్పష్టం చేశారు. ఆరు నూరైనా ఎస్సీ వర్గీకరణ అమలు జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంతెన లక్ష్మణ్, బోయిని ప్రశాంత్, అరెల్లి అనిల్, నవీన్, రాజేందర్, శ్రీనివాస్, సాయికార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ సోమేశ్వరరావుకు నివాళులర్పించిన


# మహబూబాబాద్ జిల్లా ఎస్పీ

**తొలి సమయం దంతాలపల్లి మండలం జనవరి 2**



దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన సోమేశ్వరరావు మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన అతని పార్థివదేహానికి స్వగ్రామం పెద్ద ముప్పారంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డి.ఎస్.పి తిరుపతిరావు నివాళులు అర్పించారు వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రైతుబంధు మండల మాజీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి



**తొలి సమయం దంతాలపల్లి మండలం ఫిబ్రవరి 2**

దంతాలపల్లి మండలం కుమ్మరి కుంట్ల గ్రామానికి చెందిన కొంపెల్లి లింగయ్య కుమారుడు ప్రవీణ్ వివాహ వేడుక మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరిగినది. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీకి చెందిన మండల రైతు బంధు మాజీ కోఆర్డినేటర్ ఓలాద్రి మల్లారెడ్డి హాజరై నూతన వధూవరులు కొంపెల్లి ప్రవీణ్ ప్రవల్లికల ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దుండి వెంకటేశ్వర్లు, చిల్ల రామకృష్ణ, పోలోజు కృష్ణ, కన్నా వెంకన్న, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు



**తొలి సమయం దంతాలపల్లి మండలం ఫిబ్రవరి 2**

దంతాలపల్లి మండలం కుమ్మరి కుంట్ల గ్రామ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలి కులదైవమైనటువంటి మార్కండేయ స్వామి పూజకి పరమశివుడు సహితం దిగివచ్చి చిరంజీవిగా మార్కండేయ స్వామిని ఆశీర్వదించాడ న్నారు.ప్రతినిత్యం మార్కండేయ స్వామిని పూజించాలని, జై మార్కండేయ నినాదాలతో, హోరెత్తించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ,రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టకోల సత్యనారాయణ మాట్లాడుతూ వ్యాపార, విద్య,ఉద్యోగ, రాజకీయ రంగం లో పద్మశాలీలంతా ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తేలిక మాణిక్యం, తేలిక బిక్షం, ఉపేందర్, శ్రీను, కూరపాటి ఉపేందర్, వెంకన్న, కోట నరసయ్య ,నరేష్, పాము వెంకన్న, జనార్ధన్, సిద్ధం సోమయ్య పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## వైకల్యాన్ని జయించే శక్తి దివ్యాంగులకే ఉంది

**వారి సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది**

**దివ్యాంగ పట్టభద్రుల సమ్మేళనంలో కోమటిరెడ్డి**

**కరీంనగర్, ఫిబ్రవరి, 02**

ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని శాతవాహన పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. వైకల్యాన్ని జయించి రెట్టింపైన ఆత్మవిశ్వాసంతో బ్రతకడం కేవలం దివ్యాంగులకే సాధ్యమని తెలిపారు. కళాభారతిలో ఆదివారం జరిగిన దివ్యాంగ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగవైకల్యం కలవారికి ఆత్మవిశ్వాసాన్ని, ఏదో ఒక రంగంలో ప్రతిభను భగవంతుడు ప్రసాదిస్తాడన్నారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా, ఆత్మవిశ్వాసం లేకుంటే శూన్యమన్నారు. ఆత్మవిశ్వాసంతో బ్రతికే వారిలో దివ్యాంగులు ముందంజలో ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి మంజూరు చేస్తున్న 3500 ఇళ్ళలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. దివ్యాంగులకు అన్ని సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యతనిస్తూ, సమాన హక్కులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. వికలాంగులకు రూ.4000పెన్షన్ సౌకర్యంతో పాటు, ఉచిత ప్రయాణ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతుందన్నారు.

# సోనియాకు బహుమతిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవి

**పాత్రికేయుల సమావేశంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



**తొలి సమయం, కరీంనగర్, ఫిబ్రవరి, 02**

పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా అందించాలని పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వై.నరేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందన్నారు. అభ్యర్థిత్వం ఎంపిక విషయంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో 23 రోజులే మిగిలి ఉన్నందున కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి ప్రచార కార్యక్రమంలో మరింత ముందుకు సాగుతానని తెలిపారు. ఈ ఎన్నికలు ఉత్తర తెలంగాణ చరిత్రను మార్చే విధంగా ఉండాలని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తన గెలుపులో భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, వరుసగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారని చెప్పారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో చేసిన సేవలు, తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ఆయన గుర్తు చేశారు. ఏడాది పాలన కాలంలో ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళు తున్నారని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గత ఐదు నెలలుగా ఎమ్మెల్సీ పరిధిలోని 42 నియోజకవర్గాలలో పర్యటించానని, ఈ సందర్భంగా పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు అనేకం తన దృష్టికి వచ్చాయన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా ముందుంటానని, వారి సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాల వ్యవధిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి, యువతకు భరోసా కల్పించిందన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో న్యాయ కళాశాల తోపాటు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో శాతవాహన పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకార భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,కాశిరెడ్డి శ్రీనివాస్ శ్రావణ్ నాయక్, మునిగంటి అనిల్, ఫహాద్, గండి రవీందర్, వెన్నం రజితా రెడ్డి, షబానా, శరణ్య పాల్గొన్నారు.

# సిఐటియు బస్తీబాట

**కార్మిక కుటుంబాలతో తుమ్మల రాజారెడ్డి**

**గోదావరిఖని, ఫిబ్రవరి, 02**
**తొలి సమయం**



సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ( సిఐటియు) నాయకులు బస్తీ బాట పట్టారు. గోదావరిఖని గాంధీనగర్ కార్మికవాడలో కార్మిక కుటుంబ సభ్యులతో మమేకం అయ్యారు. కార్మికులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేందుకు, ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బస్తీబాటను వారు వేదికగా చేసుకున్నారు. తమ బస్తీలో గత కొంత కాలంగా ఆరోఓ ప్లాంట్ పనిచేయడం లేదని, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అలాగే డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని కార్మికులు సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి దృష్టికి తెచ్చారు. రహదారులు,

విద్యుత్ దీపాలు తదితర సమస్యలను కార్మిక కుటుంబ సభ్యులు ఏకరువు పెట్టారు. సమస్యలను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్తామని తుమ్మల రాజారెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సింగరేణి యాజమాన్యం కార్మిక వాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం విషయంలో సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి నిధులు విడుదల చేస్తున్నామని చెబుతున్న యజమాన్యం సమస్యల పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పక్కనే ఉన్న ఆర్వో ప్లాంట్ గత కొద్ది నెలలుగా పని చేయకపోవడం సివిల్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కాక మరేమిటన్నారు. కార్మికుల ఆందోళన, సీఐటీయు పోరాట ఫలితంగా గోదావరిఖని ప్రాంతంలో దాదాపు పది ఆర్వో ప్లాంట్లు మంజూరు కాగా, అందులో కేవలం 4 ఏర్పాటుచేశారని, మూడు నెలల తరబడి మూడు ఆర్వో ప్లాంట్లు పని చేయకపోయినా, నేటికీ మరమ్మత్తులు చేసే నాథుడు లేకుండా పోయాడన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు, కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం చర్యలు తీసుకొని పక్షంలో కార్మిక కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేష్, వేణుగోపాల్ రెడ్డి, జెల్ల గజేందర్, జంగాపల్లి మల్లేష్, దాసరి సురేష్, జలగం సత్యనారాయణ, నంది నారాయణ, తిప్పారపు రాజు, మహేందర్ పాల్గొన్నారు.

# పట్టభద్రులకు రూపాయికే బీమా : ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్




**కరీంనగర్, ఫిబ్రవరి, 02 తొలి సమయం**

కుటుంబంలో పెద్దదిక్కు మృతి చెందితే దహన సంస్కారాలకు డబ్బు లేని పరిస్థితుల్లో నిరుపేద కుటుంబాలు పడుతున్న పరిస్థితులు చూసి చలించిపోయి దేశంలోనే ఎక్కడలేని విధంగా కేవలం ఒక్క రూపాయికే అంత్యక్రియల పథకానికి శ్రీకారం చుట్టిన ఘనత తనకే దక్కుతుందని మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. నిరుపేదల కోసం ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ పథకం అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక కాశ్మీర్ గడ్డలో మెట్రో హ్యూమన్ ఫస్ట్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మైనారిటీల సంక్షేమానికి , అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మైనార్టీల పట్టభద్రుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మేయర్ గా, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే నేతలకు అవకాశం ఇస్తే, పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతానని భరోసా ఇచ్చారు. పట్టభద్రుల కోసం ఒక్క రూపాయికే 5 లక్షల భీమా పథకాన్ని కల్పిస్తానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు, ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు శాసనమండలి ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. కరీంనగర్ జిల్లాలో ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనారిటీ పట్టభద్రుల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల పేరుతో పట్టభద్రులను మభ్య పెట్టి, మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# నేతకాని సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

**తొలి సమయం, ఎండపల్లి, ఫిబ్రవరి, 02**

ఎండపల్లి మండలం అంబారిపేట నేతకాని సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడుగా మోతె.సత్యం, ఉపాధ్యక్షుడుగా దర్శనాల నరేష్, ప్రధాన కార్యదర్శిగా చెరుక మల్లేశం, కోశాధికారిగా మోతె లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా దూట నరసింహులు, ప్రచార కార్యదర్శిగా దర్శనాల తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా దూట సత్యం, మోతే సురేందర్, దర్శనాల రాకేష్, మోతే భూమయ్య, గోల్లె శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంచినీళ్ళ కుమారస్వామి ఎన్నికయ్యారు. నేతకాని యువజన సంఘం అధ్యక్షుడుగా జాడి శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షుడుగా చెరుక శివమారుతిలను ఏకగ్రీవం ఎన్నుకున్నారు.



TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101